# అలవాట్లోయ్ ! అలవాట్లు

అలవాటు అనగానేమీ ? అని ఏ స్కూలు కుర్రాడిని ప్రశ్నించినా వచ్చే సమాధానం. – క్రమం తప్పకుండా ప్రతి రోజూ చేయునది – అని. ఉదహరింపుము అంటూ ఇంకాస్త సాగదీస్తే – సైన్స్ టీచరు గారికి సిగరెట్లు తెచ్చిపెట్టుట , కాంపోజిషన్ రాయనపుడు కడుపు నొప్పని కన్నీరుకార్చుట, పక్కింటి రాధ, మా గోపాలం ఏ పార్కులో కనిపించినా చూసీచూడనట్లుగా తలతిప్పుకొనుట, ఆ రాత్రి అమ్మకి చెప్తానని భయపెట్టి అర్ధరూపాయి బాల సంక్షేమ పదకం పేరిట చందాగా తీసుకొనుట వగైరాలు. ఏ వయసువాళ్ళకయినా వాళ్ళ అలవాట్లు వాళ్ళకుంటాయి.

చాలా సంవత్సరాలు అపోజిషన్లో వుండటం అలవాటయినవాడికి పవరొచ్చినా సుఖం వుండదు. ప్రతి దానికి చిర్రుబుర్రులాడుతూ, రాజీనామా కాగితాన్ని జేబులో పెట్టుకు తిరుగుతూ వుంటాడు. అలాగే ఆఫీసుల్లో విశ్రాంతి పుచ్చుకోవటం అలవాటయినవాడికి సెలవొస్తే చిరాగ్గా వుంటుంది. ఆరోగ్యం దెబ్బతిన్న ఒకరిని డాక్టరు పరీక్షచేసి, మందులకన్నా మీకు విశ్రాంతి చాలా అవసరం. అంచేత వెంటనే ఆఫీసులో జాయినవ్వమని సలహా ఇచ్చేట. అంచేతనే రిటైరయినవాళ్ళకి ఇళ్ళల్లో నిద్రలు పట్టక – అలవాటు ప్రకారం టైముకి భోజనం కానిచ్చి ఫ్యాంటు, షర్టు వేసుకుని కుర్చీలో కూర్చుని గురక పెట్టే మా పాలకొల్లు మామయ్యే దీనికి సాక్ష్యం.

నాకు తెల్సిన ఒక మిత్రుడు గత రెండేళ్ళుగా ప్రతి రోజూ క్రమం తప్పకుండా పెళ్ళిచూపుల కెళ్ళటం అలవాటయి, ఇపుడు తెగ వర్రీ అయిపోతున్నాడు. సాయంత్రం పూట వెర్రిచూపుల్తో వీధిలో వెళ్ళే ఆడపిల్లిని నిశ్శబ్దంగా అక్కడే చూసేస్తున్నాడు. ఇహ పెళ్ళి చేసుకోట్ట. ఇదే కార్యక్రమాన్ని కొనసాగిస్తానంటున్నాడు. అసలు అలవాటుకి, వ్యసనానికి ఏమిటి తేడాని ఈమధ్యన ఓ పెద్దమనిషిని ప్రశ్నిస్తే ' అడ్డాలపుడు బిడ్డలుగాని, గడ్డాలొస్తే బిడ్డలా ' అన్న సామెతని తారక మంత్రంలాగా చెప్పి, ఎనలైజు చేసుకోమని, నారదులు వాల్మీకి వొదిలి వెళ్ళినట్లు వెళ్ళిపోయేడు. కొన్ని అలవాట్లు మనం కావాలని చేసుకుంటాం. ఇంకొన్నింటిని కొంతమంది కావాలని అలవాటు చేస్తారు. అలాంటివాడే మా లింగమూర్తి మామయ్య . నిప్పులాంటివాడు. బంగారం లాంటి తత్వం.

వేలెత్తి చూపటానికి ఏమాత్రం ఆస్కారం లేనివాడు. అవినీతి అన్నా, లంచాలు, గొడవలన్నా కర్ర పుచ్చుకుని వెంటపడేవాడు. సత్యం అని, ధర్మం న్యాయం అని ఇంటా బయటా జనాన్ని కాల్చుకు తినేవాడు. అలాంటివాడు ప్రొమోషనొచ్చి పార్వతీపురం వెళ్ళేడు. అంతే ! ఏడాదిలో పార్టీ పిరాయించి, జెండా తిప్పేశాడు. ఇపుడు లంచాలు భారీగా వసూలుచేస్తున్నాట్ట. ఇంట్లో భార్య కాఫీ తాగుతారా అనడిగితే నాకేమిస్తావని అడుగుతున్నాట్ట . వీధిలో పరిచయం వున్న రిక్షావాడు గౌరవంగా ' ఎక్కండి బాబూ ' అంటే ' నా సంగతేం 'టంటున్నాట్ట ఆయన కేదో దయ్యం పట్టిందని అత్తయ్య గోల తీరా ఎంక్వయిరీలో తెలిసిందేమిటంటే – నిప్పులాంటి మామయ్యని భరించలేని ఆ వూరి ప్రబుద్ధులు, నావల్టీగా ఓ పథకం ఆలోచించి, అమలుపర్చారట. మామయ్య లంచ్‌కి వెళ్ళి తిరిగొచ్చేసరికి టేబిలుపైన ఒక వంద కాగితాన్ని రెపరెపలాడుతూ కనిపించేలా వుంచేరట. మొదటి రోజు మామయ్య ఎంతో హానెస్ట్‌గా అందర్ని పిలిచి వందకాగితం ఎవరిదని అడిగేట్ట. కానీ అంతా ముక్తకంఠంతో తెలవదంటే తెలవదనటం చేత మామయ్య ఆ కాగితాన్ని కళ్ళకద్దుకుని జేబులో పెట్టుకున్నాట్ట. అలా ప్రతి రోజూ వంద కాగితం కనిపించటం. దాన్ని జేబులో పెట్టుకోవటం అలవాటయిన మా లింగమూర్తి మామయ్యకి పది రోజుల్లో వంద కాగితం కోసం వెతుక్కోవటం, కనిపించకపోతే అందర్ని తిట్టి పోయడం మొదలుపెట్టి మెల్లిమెల్లిగా దారిలోకొచ్చి ఇపుడు దేశాన్నేదో చేస్తున్నాడు.

అంచేతనే , చప్పుడు చేసే ఫ్యాను కింద నిద్రపోవటం అలవాటయిని వారికి మెత్తగా తిరిగే పంకా కింద నిద్రపట్టదు. మురుగు కాలువ పక్కన వుండేవాడికి స్వచ్ఛమైన గాలి సరిపడదు. పొగడ్తలు అలవాటయిన వారికి విమర్శ రుచించదు. ఈ సందర్భంలో పాతది కాస్త ముదురు జోకే అయినా చెప్పుకుంటే బావుంటుంది. మొదటి రాత్రి గదిలోకెళ్ళిన రసికుడు అలవాటు ప్రకారం భార్యచేతిలో వెయ్యి కాగితం పెట్టాట్ట. అప్పుడు ఆవిడ గూడా ఏమాత్రం విస్తుపోకుండా చిల్లర లేదండీ ! అన్నదట !

అయ్యో ! అదీ అలవాటు యొక్క పొగరు, పవరూన్నూ !

------- అయ్యిపోయింది -------